

'పంచాయతీ ఎన్నికల ప్రత్యేక పర్యవేక్షణ సెల్'

ఉత్తర్వులు జారీ చేసిన కలెక్టర్

ఇబ్రహీంపట్నం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పంచాయతీ ఎన్నికల ప్రత్యేక పర్యవేక్షణ సెల్‌ను ఏర్పాటు చేశారు. ఈ సెల్ జిల్లా కన్వీనర్‌గా ముఖ్య ప్రణాళికాధికారి (సీపీవో), జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి (డీఆర్‌డీవో), జిల్లా ఆడిట్ అధికారి, జిల్లా ప్రజా సంబంధాల అధికారి (డీపీఆర్వో) సభ్యులుగా ఏర్పాటు చేస్తూ కలెక్టర్ సి.నారాయణరెడ్డి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. తెలంగాణ పంచాయతీరాజ్ చట్టం -2018లోని సెక్షన్ 211 ప్రకారం గ్రామ పంచాయతీ ఎన్నికల్లో పదవుల కోసం వేలం పాట, బెదిరింపులు, ప్రలోభాలు, బలవంతం తదితర అన్ని ఫిర్యాదులను స్వీకరించి, విచారణ చేసి నివేదికలు అందిస్తారు. వాట్సాప్, ఫోన్ కాల్స్, రాత పూర్వక ఫిర్యాదులు, పత్రికల క్లిప్పింగ్‌లు, మౌఖిక ఫిర్యాదుల ద్వారా ఆర్వో కార్యాలయాల నుంచి వచ్చే నివేదికలను పర్యవేక్షణ చేస్తారు. అలాగే గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ఏకగ్రీవ ఫలితాలను ప్రకటించడానికి అభ్యంతరం లేదని క్లియరెన్స్ జారీ చేయడం కోసం జిల్లా ఎన్నికల అధారిటీకి తక్షణమే వాస్తవ నివేదికను సమర్పిస్తారు. ఎన్నికల్లో ఓటర్లను ప్రలోభపెట్టే ఫిర్యాదులు అందిన వెంటనే అదే రోజు విచారణ పూర్తయ్యేలా ఈ సెల్ చూస్తుంది.

బీజేపీ జిల్లా ఇన్‌చార్జిల నియామకం

ఇబ్రహీంపట్నం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): భారతీయ జనతా పార్టీ రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా ఇన్‌చార్జిలను నియమిస్తూ ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. రంగారెడ్డి అర్బన్ జిల్లా ఇన్‌చార్జిగా ఆలె భాస్కర్, రంగారెడ్డి రూరల్ ఇన్‌చార్జిగా వీరబెల్లి రఘునాథ్‌రావు, వికారాబాద్ జిల్లా ఇన్‌చార్జిగా ఎ.సుధాకర్‌రావు, మేడ్చల్ - మల్కాజిగిరి అర్బన్ ఇన్‌చార్జిగా సేవెల్ల మహేందర్, మేడ్చల్ - మల్కాజిగిరి రూరల్ ఇన్‌చార్జిగా సామ రంగారెడ్డిలను నియమించారు.

గెలుపు గుర్రాల అన్వేషణ

పంచాయతీల్లో పాగాకు ఎత్తుగడలు

- సర్పంచ్ పదవికి చాలా గ్రామాల్లో తీవ్ర పోటీ
- ఎంపీటీసీగా అవకాశం కల్పిస్తామని నేతల బుజ్జగింపు
- గెలుపు అవకాశాలు, ఆర్థికబలం ఆధారంగా అభ్యర్థుల ఎంపిక
- ప్రజాభిమానం కలిగిన నేతలను తమవైపు తిప్పుకునేందుకు యత్నం
- ఆమనగల్లు, కడ్తాల్, తలకొండపల్లి, మాడ్గుల మండలాల్లో సమరం షురూ
- 103 పంచాయతీల్లో రసవత్తర పోరు

పల్లె పోరును ప్రధాన పార్టీలు ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటున్నాయి. గ్రామ పంచాయతీ ఎన్నికలకు షెడ్యూల్ విడుదల కావడంతో తమ అభ్యర్థులను గెలిపించుకోవడానికి వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నాయి. పార్టీ గుర్తులపై జరిగే ఎన్నికలు కాకపోవడంతో గ్రామాల్లో పట్టున్న నాయకుల వడబోతలో అన్ని పార్టీలు నిమగ్నమయ్యాయి. ప్రధానంగా అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్‌ఎస్‌కు చెందిన ముఖ్య నేతలు గ్రామాల వారీగా గెలుపు గుర్రాల కోసం అన్వేషిస్తున్నారు. పంచాయతీ ఎన్నికల బరిలో నిలిపేందుకు అభ్యర్థుల పూర్వపరాలు, బలాబలాలు, చరిష్మా, సేవలపై ఆరా తీస్తున్నారు.

ఆమనగల్లు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల నామినేషన్లు నేటి (ఆదివారం) నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో పల్లెల్లో రాజకీయం వేడెక్కింది. ఎన్నికల్లో ఎలాగైనా సత్తా చాటాలని ప్రధాన పార్టీలు ఎత్తుగడ వేస్తున్నాయి. పార్టీ మద్దతు అభ్యర్థుల విజయమే లక్ష్యంగా వ్యూహాలు రచిస్తున్నారు. రెండో విడత డిసెంబర్ 14న, మూడో విడత 17న జరిగే పంచాయతీ ఎన్నికల్లో నిలబెట్టేందుకు గ్రామాలలో తిరుగుతూ గెలుపు గుర్రాల కోసం అన్వేషిస్తున్నారు. అభ్యర్థుల ఎంపిక కోసం మండల, గ్రామస్థాయి పార్టీల నేతలు మల్లగుల్లాలు పడుతున్నారు. ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీఆర్‌ఎస్, బీజేపీల నుంచి కొన్ని గ్రామాలలో ముగ్గురు నలుగురు అభ్యర్థులు ఎన్నికల్లో నిలబడేందుకు పోటీ పడుతున్నారు. దీంతో ఆయా పార్టీల నాయకులు వారిని బుజ్జగిస్తున్నారు. ప్రస్తుతం రిజర్వేషన్లు, వివిధ కారణాల చేత సర్పంచ్ అవకాశం రాని నేతలకు వచ్చే ఎంపీటీసీ ఎన్నికల్లో అవకాశం కల్పిస్తామని నచ్చజెప్పే ప్రయత్నాలు చేస్తున్నారు. స్థానిక నేతల అభిప్రాయానికనుగుణంగా గెలుపు అవకాశాలు, ఆర్థికంగా

మిగతా 8వ పేజీలో...





వైకల్యం శరీరానికే.. మనసుకు కాదు

- జిల్లా దివ్యాంగుల సంక్షేమాధికారి శ్రీలత



క్రీడాకారులకు టీషర్టులు అందజేస్తున్న శ్రీలత

ఇబ్రహీంపట్నం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులు సకలాంగులతో సమానంగా ప్రతిభాపాటవాలను ప్రదర్శించారని జిల్లా దివ్యాంగుల సంక్షేమాధికారి ఎస్.శ్రీలత అభివర్ణించారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా శనివారం సరూర్‌నగర్ స్టేడియంలో జిల్లా స్థాయి క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె జెండా ఊపి క్రీడలను ప్రారంభించారు. అలాగే నాట్కో ట్రస్టు సహకారంతో క్రీడాకారులకు టీషర్టులు, క్యాప్‌లు అందజేశారు. మార్చ్‌ఫాస్ట్ అనంతరం క్రీడా ప్రతిజ్ఞ చేయించారు. పరుగు పందెం, షాట్ పుట్, జావెలిన్ త్రో, క్యారమ్స్, చదరంగం తదితర పోటీలను నిర్వహించారు. ప్రతిభ చూపిన వారికి ప్రోత్సాహక బహుమతులందజేశారు. ఈ సందర్భంగా శ్రీలత మాట్లాడుతూ వైకల్యమనేది శరీరానికే కానీ మనసుకు కాదన్నారు. జిల్లా నలుమూలల నుంచి 600 మంది దివ్యాంగులు వివిధ అంశాలకు సంబంధించిన పోటీల్లో పాల్గొని స్ఫూర్తిదాయకంగా నిలిచారన్నారు. ఈ కార్యక్రమంలో సీడీపీవోలు శాంతిశ్రీ, వినీతాదేవి, ఉదయ, కవిత, రేణుక పాల్గొన్నారు.

శంషాబాద్ - పరిగి రేడియల్ రోడ్డు

అలైన్‌మెంట్ మార్చాలి

- నర్కూడ గ్రామస్తుల ఆందోళన



నర్కూడ కుంటల వద్ద ప్లకార్డులతో గ్రామస్తులు

శంషాబాద్ రూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : రీజినల్ రింగ్ రోడ్డుకు అనుసంధానంగా హెచ్‌ఎండీఏ ప్రతిపాదించిన శంషాబాద్ - పరిగి రేడియల్ రోడ్డు అలైన్‌మెంట్‌ను మార్చాలని శనివారం నర్కూడ గ్రామస్తులు ఆందోళన చేపట్టారు. అనంతరం వారు మాట్లాడుతూ.. శంషాబాద్ - పరిగి రేడియల్ రోడ్డును గ్రామ కంఠాలను, ఇళ్లను, కుంటలను ఆక్రమిస్తూ ఏర్పాటు చేయవద్దని, వెంటనే అలైన్‌మెంట్ మార్చాలని డిమాండ్ చేశారు. ఒక్క నర్కూడ గ్రామంలోనే మూడు కుంటలు రేడియల్ రోడ్డు నిర్మాణంలో పోతున్నాయని అవి తాగు, సాగు నీరు అందించేవని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కుంటల వద్ద గ్రామస్తులు ప్లకార్డులు పట్టుకుని ఆందోళనకు దిగారు. ప్రభుత్వం అలైన్‌మెంట్ మార్చేందుకు చర్యలు తీసుకోవాలని, లేదంటే పెద్దఎత్తున ఆందోళనకు చేపడుతామని హెచ్చరించారు.



సీఎస్‌ఆర్ ఆధ్వర్యంలో కట్ట నిర్మాణంతో జలకళను సంతరించుకున్న గోదుమకుంట చెరువు

సీఎస్‌ఆర్‌తో జలకళ

- సాయిరెడ్డి, గోధుమకుంట చెరువులకు మరమ్మతులు
- పెరిగిన భూగర్భ జలాలు
- కట్టలపై ఆహ్లాదాన్ని పంచుతున్న పచ్చదనం
- సుందరీకరణపై హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు

కొత్తూర్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): కార్పొరేట్ సంస్థలు సామాజిక బాధ్యతగా సీఎస్‌ఆర్ (కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ) నిధులతో చేపట్టిన మరమ్మతులు, ఆధునీకరణ పనులతో చెరువులు, కుంటలు జలకళను సంతరించుకున్నాయి. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కింద కంపెనీల సహకారంతో చెరువులు జీవం పోసుకున్నాయి. భూగర్భ జలాలు పెరిగాయి. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సీఎస్‌ఆర్ కంద కార్పొరేట్ సంస్థలు చెరువుల పునరుద్ధరణకు ముందుకు వచ్చి నిధులు వెచ్చించాయి. చెరువులు, కుంటలకు మరమ్మతులు చేశాయి. ప్రముఖ కార్పొరేట్ సంస్థ అమెజాన్ ఫండింగ్‌తో ఎన్‌జీవో స్వచ్ఛంద సంస్థ అయిన సెట్రీస్ ఆధ్వర్యంలో చెరువులు, కుంటలను పునరుద్ధరించారు. కట్టలను పటిష్ఠం చేయడంతోపాటు శాస్త్రీయ పద్ధతిలో పూడిక తీత, సుందరీకరణ పనులు చేపట్టాయి. జంగిల్ క్లియరెన్స్, గ్రీనరీ, వాకింగ్ ట్రాక్‌లు, సోలార్ లైటింగ్ వంటి సౌకర్యాలను కల్పించడంతో కొత్తూర్ మున్సిపాలిటీ పరిధిలోని సాయిరెడ్డి చెరువు, గోదుమకుంట చెరువులు కొత్త కళను సంతరించుకున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు చెరువులు నిండు కుండను

మిగతా 8వ పేజీలో...

మత్స్యకారులకు ఉపాధి



చెరువులను పునరుద్ధరించడంతో చెరువుల్లో నీరు పుష్కలంగా ఉంది. దీంతో చేపల సంపద పెరిగి మత్స్యకారులకు ఉపాధి దొరుకుతుంది. మండలంలో ఉన్న ఆరు చెరువులను కూడా కంపెనీలు దత్తత తీసుకొని అభివృద్ధి చేయాలి.

– మాసుల అంజయ్య, మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు, కొత్తూర్

భూగర్భ జలాలు పెరిగాయి



గోధుమకుంటలో పూడికతీత, కట్ట నిర్మాణ పనులు పూర్తి చేయడంతో ఇటీవల కురిసిన వర్షాలకు నీరు బాగా వచ్చి చెరువు నిండింది. దీంతో భూగర్భ జలాలు పెరిగాయి. బోర్లు బాగా పోస్తున్నాయి. పంటలకు ఎంతో ఉపయోగకరంగా మారింది. చెరువుల పునరుద్ధరణకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావడం అభినందనీయం.

– ఇప్పల గిరి, రైతు, కొత్తూర్

ఐదు పంచాయతీలు ఏకగ్రీవం

దేవునిబండ తండా, కన్హాశాంతివనం, చెరుకుపల్లి, పాత ఆగిర్యాల, లక్ష్మీదేవిపల్లిలో యునానిమస్

ముగిసిన మొదటి విడత నామినేషన్ల పర్వం



కొత్తూర్ : గూడూర్ సర్పంచ్ అభ్యర్థిగా నామినేషన్ వేస్తున్న ఉప్పల దయానంద్ గుప్తా

ఇబ్రహీంపట్నం/ కేశంపేట, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మొదటి విడత నామినేషన్ల ఘట్టం శనివారం ముగిసేసరికి ఐదు పంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి. కేశంపేట మండలం దేవునిబండ తండా సర్పంచ్‌గా సుజాత హన్మంత్‌నాయక్, నందిగామ మండలం కన్హాశాంతివనం సర్పంచ్‌గా మధుసూదన్‌రెడ్డి, కొందుర్గు మండలం చెరుకుపల్లి గ్రామ సర్పంచ్‌గా యాదయ్య, పాత ఆగిర్యాల సర్పంచ్‌గా యాదమ్మ, లక్ష్మీదేవిపల్లి సర్పంచ్‌గా అనూష సహా వార్డు సభ్యులు ఏకగ్రీవమైనారు. ఈ విడతలో ఏడు మండలాల పరిధిలోని 174 పంచాయతీలు, 1530 వార్డుల ఎన్నికలకు సంబంధించి అభ్యర్థులు నామినేషన్లు వేశారు. వీటిలో 169 పంచాయతీల్లో సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికలు జరుగనున్నాయి. కాగా, శనివారం రాత్రి పొద్దుపోయే వరకు సర్పంచ్ అభ్యర్థులుగా 581, వార్డు సభ్యుల అభ్యర్థులుగా 2520 మంది నామినేషన్లు వేశారు. నామినేషన్ల ప్రక్రియ ఇంకా కొనసాగుతున్నందున ఈ సంఖ్య పెరిగే అవకాశముంది. కాగా పలు పంచాయతీల్లో ఆయా పార్టీలకు చెందిన వారు ఒకరికి మించి నామినేషన్లు వేయడంతో బుజ్జగింపులు కొనసాగుతున్నాయి. పార్టీల జిల్లా నాయకత్వం రంగంలో దిగి ఒకరికి కంటే ఎక్కువ మంది నామినేషన్లు వేసిన వారిని పిలిపించి సయోధ్య కుదిర్చే పనిలో ఉన్నారు. ఈ ఎన్నికలను ఆయా పార్టీలు సవాల్‌గా తీసుకున్నాయి. అంగబలం, అర్థ బలం, ప్రజల్లో పలుకుబడి ఉన్నవారినే అభ్యర్థులుగా నిలుపాలనేది లక్ష్యంగా ముందుకు పోతున్నారు. అధికార కాంగ్రెస్, ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్‌ఎస్ పార్టీలు మండలాలు, పంచాయతీల వారీగా సమావేశాలు ఏర్పాటుచేసి కార్యకర్తల అభిప్రాయం సేకరిస్తోంది. జిల్లాలో బీజేపీ కూడా దాదాపుగా అన్ని పంచాయతీల్లో అభ్యర్థులను నిలబెడుతుండగా, సీపీఎం తమకు పట్టున్న గ్రామాల్లో పోటీకి దిగుతోంది. గత ఎన్నికతోట పోల్చుకుంటే ఈ సారి రిజర్వేషన్లు తారుమారవడంతో చాలావరకు కొత్త ముఖాలు ఎన్నికల్లో పోటీపడుతున్నాయి.

స్వరాష్ట్ర సాధనలో కేసీఆర్ కృషి మరువలేనిది

- ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

శంషాబాద్ రూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): స్వరాష్ట్ర సాధన కోసం కేసీఆర్ చేసిన కృషి మరువలేనిదని, ఉద్యమ సమయంలో కేసీఆర్ చేపట్టిన దీక్ష చరిత్రలో నిలిచిపోయిందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అన్నారు. రాజేంద్రనగర్ నియోజకవర్గం శంషాబాద్ మున్సిపల్ పరిధిలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అధ్యక్షతన దీక్ష దివస్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సబితారెడ్డి మాట్లాడుతూ ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం కేసీఆర్ చరిత్రలో నిలిచిపోయేలా దీక్ష చేపట్టారన్నారు. ఈ కార్యక్రమంలో శంషాబాద్ మండల ఎంపీపీ దుద్యాల శ్రీనివాస్, పార్టీ మండల అధ్యక్షుడు మాచర్ల మోహన్‌రావు, రాజేంద్రనగర్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మూడంచెల భద్రతతో గ్లోబల్ సమ్మిట్

మాజీ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి



మాట్లాడుతున్న కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి

కందుకూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : జాతీయ, అంతర్జాతీయ ప్రముఖులు, వ్యాపారవేత్తలతో రాష్ట్ర ప్రభుత్వం డిసెంబరు 8, 9 తేదీల్లో ఏర్పాటు చేస్తున్న తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్-2025ను మూడంచెల భద్రతతో నిర్వహించనున్నట్లు మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం నియోజకవర్గ ఇంచార్జీ కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి అన్నారు. శనివారం పీసీసీ ప్రధానకార్యదర్శి ఏనుగు జంగారెడ్డి, మహేశ్వరం ఏఎంసీ చైర్మన్ ఎస్.కృష్ణానాయక్, పీసీసీ సభ్యులు దేప భాస్కర్‌రెడ్డిలతో కలిసి మీర్ఖాన్‌పేటలో జరుగుతున్న గ్లోబల్ సమ్మిట్ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సీఎం రేవంత్‌రెడ్డి నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తూనే.. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నారని గుర్తు చేశారు. మీర్ఖాన్‌పేటలో చేపడుతున్న స్కిల్ యూనివర్సిటీ, ఫ్యూచర్‌సిటీ కమిషనర్ కార్యాలయంతో పాటు ప్రభుత్వానికి భూములు ఇచ్చిన రైతులకు హెచ్‌ఎండీఏ తరహాలో అభివృద్ధి చేస్తూ, వారికి మౌలిక వసతులను కల్పించడానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు. వివిధ రంగాల్లోని నిపుణులు. పెట్టుబడుదారులు, ప్రపంచ స్థాయి ప్రముఖులు పాల్గొనే సమ్మిట్‌కు పాసులు ఉన్నవారికి మాత్రమే అనుమతులు ఉంటాయని గుర్తు చేశారు. విదేశాలను 1300 మంది జాతీయ స్థాయి ప్రముఖులు సమ్మిట్‌కు హాజరవుతారని తెలిపారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ బొక్క జంగారెడ్డి, నాయకులు ఎస్.వెంకట్‌రాంరెడ్డి, రాణాప్రతాప్‌రెడ్డి, మూల హన్మంత్‌రెడ్డి, రాకేష్‌గౌడ్, బి.భూపాల్‌రెడ్డి, యుగేందర్‌గౌడ్, డిల్లీ శ్రీధర్, శ్రీనివాస్‌నాయక్, రాంచంద్రారెడ్డి, వీరారెడ్డి, మహేందర్, ఎస్.నరేందర్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు. అనంతరం మండల కేంద్రంలోని టంకరి రాంరెడ్డి ఫంక్షన్ హాల్‌లో కాంగ్రెస్ పార్టీ నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులపై సమీక్ష నిర్వహించారు.

ఎన్నికల కోడ్.. ప్రజావాణి రద్దు

- ఎలక్షన్స్ ముగిసిన తర్వాత యథాతథం

ఇబ్రహీంపట్నం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి కోడ్ అమల్లోకి వచ్చిన నేపథ్యంలో కలెక్టరేట్‌లో ప్రతీ సోమవారం నిర్వహించే 'ప్రజావాణి' కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ సి.నారాయణరెడ్డి తెలిపారు. జిల్లాలో సర్పంచ్ ఎన్నికలు ముగిసిన తర్వాత ఈ కార్యక్రమం యథావిధిగా కొనసాగుతుందని తెలిపారు. ప్రజలు, ఫిర్యాదుదారులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని ఆయన కోరారు.

ఎయిర్‌పోర్టులో మనీశ్‌శర్మకు ఘన స్వాగతం

శంషాబాద్ రూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): శంషాబాద్ విమానాశ్రయంలో కాంగ్రెస్ పార్టీ నేషనల్ యూత్ అధ్యక్షుడు మనీశ్‌శర్మకు ఆ పార్టీ నేతలు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. శనివారం ఢిల్లీ నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు చేరుకున్న ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. అనంతరం ప్రత్యేక కాన్వాయ్‌లో హైదరాబాద్‌కు బయల్దేరి వెళ్లారు.

పల్లెల్లో ఏకగ్రీవాల పర్వం

- వికారాబాద్ జిల్లాలో 18 మంది
- ప్రభుత్వ పోత్సాహం వస్తుందని నిర్ణయం
- అభ్యర్థుల ఎంపికతో సందడిగా గ్రామాలు



బషీరాబాద్: మంతన్‌గౌడ్‌లో ఏకగ్రీవమైన సర్పంచ్, వార్డు సభ్యులతో ప్రజలు

బషీరాబాద్/దుద్యాల్/తాండూరు రూరల్/పెద్దేముల్/యాలాల, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల వేళ గ్రామాల్లో ఏకగ్రీవాల సందడి నెలకొంది. వికారాబాద్ జిల్లాలో ఒక్క రోజే 18 మంది అభ్యర్థులు ఏకగ్రీవమయ్యారు. షీరాబాద్ మండలంలోని మంతన్‌గౌడ్, హంక్యానాయక్‌తండా, బాబునాయక్‌తండా గ్రామ పంచాయతీల సర్పంచ్, వార్డు సభ్యుల పదవులు ఏకగ్రీవం అయ్యాయి. మంతన్‌గౌడ్ పంచాయతీ ఎస్టీ రిజర్వు కాగా, ఒకే ఒక కుటుంబం ఉండటంతో సర్పంచ్, రెండు వార్డు సభ్యులు ఆ కుటుంబానికి దక్కిన విషయం తెలిసిందే. మిగిలిన మరో ఆరు వార్డులకు కూడా ప్రజలు సమావేశమై ఏకగ్రీవ తీర్మానం చేసుకుని ఒక్కో నామినేషన్ సెట్ వేసి ఏకగ్రీవం చేసుకున్నారు. హంక్యానాయక్‌తండా, బాబునాయక్‌తండా పంచాయతీల్లో పార్టీలకు అతీతంగా స్థానిక నాయకులు ప్రజలు చర్చించుకుని సర్పంచ్, వార్డు సభ్యుల పదవులు ఏకగ్రీవం అయ్యేలా నిర్ణయం తీసుకున్నారు. నామినేషన్ల చివరి రోజు సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు సింగిల్ నామినేషన్ దాఖలు చేసి పదవులను ఏకగ్రీవం చేసుకున్నారు. మంతన్‌గౌడ్ సర్పంచ్‌గా ఎరుకల భీమప్ప, హంక్యానాయక్‌తండా సర్పంచ్‌గా రథోడ్ అనిత, బాబునాయక్‌తండా సర్పంచ్‌గా జె.అనిత, ఆయా పంచాయతీల వార్డు సభ్యుల పదవులు ఏకగ్రీవం అయ్యాయి. కాగా, అధికారంగా ప్రకటించాల్సి ఉంది.

దుద్యాల్ మండలం సంగాయిపల్లిలో..

దుద్యాల్ మండలంలోని సంగాయిపల్లి గ్రామ పంచాయతీలో సర్పంచ్, వార్డు సభ్యులను శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ పార్టీలకు చెందిన నాయకులు రెండు రోజులుగా గ్రామంలో సమావేశాలు నిర్వహించారు. పోటీ చేస్తున్న ఇరు పార్టీల అభ్యర్థులు ఓ నిర్ణయానికి వచ్చారు. కాంగ్రెస్ సర్పంచ్ అభ్యర్థి వెంకట్‌రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామంలో ఎనిమిది వార్డులు ఉండగా, అన్నీ పార్టీలకు చెందిన వారికి అవకాశం కల్పించారు. ఈ విషయంపై ఆయా పార్టీల నాయకులు, ప్రజలను వివరణ కోరగా గ్రామంలో 84 ఇందిరమ్మ ఇళ్లను అర్హులకు మంజూరు చేయడంతో ఏకగ్రీవం చేసేందుకు ముందుకొచ్చామని తెలిపారు.

చిట్టిఘనాపూర్‌లో సింగిల్ నామినేషన్

తాండూరు మండల పరిధిలోని చిట్టిఘనాపూర్ గ్రామ పంచాయతీ నామినేషన్ ఒక్కటే రావడంతో ఏకగ్రీవం అయినట్లు తెలిసింది. సర్పంచ్ అభ్యర్థిగా పటేల్ విజయ్ కుమార్ నామినేషన్ దాఖలు చేశారు. దీంతో ఆయనకు పోటీగా ఎవరూ నామినేషన్ దాఖలు చేయకపోవంతో సింగల్ నామినేషన్ రావడం వల్ల ఆయన ఒక్కడే ఏకగ్రీవ సర్పంచ్‌గా ఎన్నికైనట్లు సమాచారం. వార్డు సభ్యులుగా 1వ వార్డు మాల పద్మమ్మ, 2వ వార్డు మున్నూర్ పద్మమ్మ, 3వ వార్డు ఘనాపూరం గంగమ్మ, 4వ వార్డు దశరథ్ గౌడ్, 5వ వార్డు ఈడ్గి భాగ్యమ్మ, 6వ వార్డు మల వెంకప్ప, 7వ వార్డు బీరప్ప, 8వ వార్డు ప్రవీణ్ గౌడ్ వీరు మాత్రమే నామినేషన్ దాఖలు చేయడంతో అన్ని వార్డు స్థానాలు ఏకగ్రీవం అయ్యే అవకాశం ఉంది.

పెద్దేముల్‌లో రెండు గ్రామాలు

పెద్దేముల్ మండలంలో రెండు గ్రామ పంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి. పెద్దేముల్ మండలంలో మొత్తం 38 పంచాయతీలు ఉండగా అన్నింటిలో రెండుకుమించి నామినేషన్లు అందాయి. కేవలం దుగ్గాపూర్, సిద్దన్నమడుగు తండా పంచాయతీలకు ఒక్కో నామినేషన్ మాత్రమే అందాయి. మండలంలోని దుగ్గాపూర్ పంచాయతీకి సర్పంచ్‌గా జాజికర్తి మంగమ్మతోపాటు ఎనిమిది వార్డులు కూడా ఏకగ్రీవం అయ్యాయి. సిద్దన్నమడుగు తండాలోని మొత్తం ఆరు వార్డులతోపాటు సర్పంచ్‌గా రాథోడ్ విజయ్ ఏకగ్రీవం అయ్యారు.

యాలాలలో నాలుగు పంచాయతీలు

యాలాల మండలంలో నాలుగు గ్రామ పంచాయతీలు ఏకగ్రీవం అయ్యాయి. సంగెంఖుర్దులో సుధాలక్ష్మి, పేర్కంపల్లితండాలో ఈర్యానాయక్, లక్ష్మీనారాయణపూర్‌లో నాగమణి, కిష్టాపూర్‌లో పల్లె స్వప్న ఒకేఒక్క నామినేషన్ దాఖలు చేయడంతో వారు సర్పంచ్‌గా ఏకవగ్రీవమైనట్లు గ్రామస్తులు చెబుతున్నారు.



దుద్యాల్: సంగాయిపల్లిలో ఏకగ్రీవమైన సర్పంచ్, వార్డు సభ్యులతో గ్రామస్తులు

ఆలయ భూమిలో బోర్డు పాతిన అధికారులు



యాచారం, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): యాచారంలోని సర్వే నంబర్ 42లో తిరుమలానందస్వామి ఆలయానికి 10ఎకరాల 26గుంటల భూమి ఉంది. ఈ భూమి ఆక్రమణకు యత్నించారు. గతంలో అధికారులు హద్దురాళ్లు పాతినా వాటిని తొలగించారు. ఇదే అంశంపై వార్తలు రావడంతో రాష్ట్ర వ్యవసాయశాఖ రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ఎం.కోదండరెడ్డి కల్పించుకొని దేవాదాయశాఖ అధికారులతో మాట్లాడారు. దీంతో స్థలానినికి అధికారులు ఫెన్సింగ్ వేశారు. ఫెన్సింగ్ కూడా తొలగించారు. గమనించిన అధికారులు శనివారం రంగారెడ్డి ఎండోమెంట్ అధికారులు బోర్డులు ఏర్పాటు చేశారు. ఈ భూమి కబ్జా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తరచూ ఈ భూమిని పరిశీలించాలని అధికారులు ఆలయ పూజారికి సూచనలు చేశారు.

డీపీఆర్వో ఉద్యోగ విరమణ కార్యక్రమం



వెంకటేశం దంపతులను సన్మానిస్తున్న అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి

ఇబ్రహీంపట్నం, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): జిల్లా పౌర సంబంధాల అధికారి వెంకటేశం ఉద్యోగ విరమణ కార్యక్రమం శనివా రం కలెక్టరేట్‌లో ఘనంగా జరిగింది. ఆత్మీయ అభినందన సభలో జిల్లా అదనపు కలెక్టర్ చంద్రారెడ్డితోపాటు వివిద శాఖల లఅధికారు లు, సిబ్బంది, తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం నాయకులు పాల్గొని ఆయన్ను ఘనంగా సన్మానించారు. వెంకటేశం నిబద్ధతతో పనిచేశారని అధికారులు కొనియాడారు.

టీఆర్‌టీఎఫ్ జిల్లా అధ్యక్షుడిగా రమేశ్‌గౌడ్





జాము కుశాల్, ప్రధాన కార్యదర్శి

యాచారం, నవంబరు, 29(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్ జిల్లా కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా రమేశ్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి జామకుశాల్ ఎన్నికయ్యారు. జిల్లాలో శనివారం సంఘం సర్వ సభ్య సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. దీనికి ఎన్నికల అధికారిగా కె.రాజునాయక్ వ్యవహరించారు. సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడిగా కె.రాజునాయక్, అసోసియేట్ అధ్యక్షుడిగా భిక్షపతి, అదనపు ప్రధాన కార్యదర్శిగా నర్సింహులు, ఉపాధ్యక్షుడిగా శ్రీనివాసులు, మహిళా కార్యదర్శిగా టి.సులోచన, కార్యదర్శులుగా రాజు, మధుసూదన్, శైలజ ఎన్నికయ్యారు.

ఉపాధ్యాయ వృత్తి గౌరవప్రదమైంది



సత్యనారాయణను సత్కరిస్తున్న సహచర టీచర్లు

మంచాల, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ వృత్తి గౌరప్రదమైనదని ఎంఈవో రాందాస్ అన్నారు. లింగంపల్లి జెడ్పీహెచ్ఎస్ గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడు సత్యనారాయణ శనివారం రిటైరయ్యారు. ఆయనను సహచర ఉపాధ్యాయులు సత్కరించారు. ఎంఈవో మాట్లాడుతూ.. విద్యార్థులను భావి పౌరులుగా తీర్చిదిద్దే బృహత్తర బాధ్యత గురువులపై ఉంటుందన్నారు. 31సంవత్సరాలు ఉపాధ్యాయుడిగా సేవలందించిన సత్యనారాయణ సార్ శేషజీవితాన్ని సంతోషంగా గడపాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు నారాయణరెడ్డి, సురేందర్‌రెడ్డి, అధ్యాపకులు ఎస్.రాజిరెడ్డి, జగన్నాథ్‌శర్మ పాల్గొన్నారు.

రింగ్ రోడ్డు పైనుంచి గ్యాస్ ట్యాంకర్ బోల్తా

అక్కడికక్కడే డ్రైవర్ మృతి

అప్రమత్తతతో తప్పిన పెను ప్రమాదం



సహాయక చర్యల్లో సిబ్బంది

మేడ్చల్ టౌన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): గ్యాస్ తరలిస్తున్న ఓ ట్యాంకర్ రింగ్ రోడ్డు పైనుంచి బోల్తా పడింది. ఓఆర్ఆర్ పెట్రోలింగ్ సిబ్బంది, పోలీసులు అప్రమత్తం కావటంతో పెను ప్రమాదం తప్పింది. ఓఆర్ఆర్ పెట్రోలింగ్ సిబ్బంది, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చెర్లపల్లి హెచ్‌పీ గ్యాస్ డిపో నుంచి గ్యాస్ నింపుకొని మహారాష్ట్రలోని షోలాపూర్ వెళ్తున్న ట్యాంకర్ శనివారం మేడ్చల్ పోలీస్టేషన్ పరిధిలోని మునీరాబాద్ శివారులో రింగ్ రోడ్డు పై కారును తప్పించే ప్రయత్నంలో అదుపు తప్పి రింగ్ రోడ్డు పైనుంచి కిందికి బోల్తా పడింది. దీంతో డ్రైవర్ రామరాజు(45) అక్కడిక్కడే మృతి చెందాడు. ఘటనా స్థలానికి చేరుకున్న ఓఆర్ఆర్ పెట్రోలింగ్ సిబ్బంది పోలీసులకు సమాచారం ఇచ్చారు. అనంతరం ట్యాంకర్ నుంచి గ్యాస్ లీకేజీ అవుతుండటంతో వెంటనే చెర్లపల్లి హెచ్‌పీ గ్యాస్ డిపోనకు సమాచారమిచ్చారు. హుటాహుటీన ఘటనా స్థలానికి చేరుకున్న సిబ్బంది గ్యాస్ లీకేజీని కట్టడి చేశారు. దీంతో ట్యాంక్ పేలకుండా పెను ప్రమాదం తప్పింది. డ్రైవర్ తమిళనాడు రాష్ట్రానికి చెందిన వాడిగా గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మికతను అలవర్చుకోవాలి



పడి పూజలో సీఎస్ రంగరాజన్, ఆదిత్య పరాశ్రీ స్వామిజీ

మొయినాబాద్ రూరల్, నవంబరు29(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మికతను అలవర్చుకోవాలని చిలుకూరు బాలాజీ దేవాలయం ప్రధాన అర్చకులు సీఎస్ రంగరాజన్, ప్రముఖ గురువు ఆదిత్య పరాశ్రీ స్వామిజీ అన్నారు. శనివారం మున్సిపల్ పరిధిలోని హిమాయత్ నగర్ వార్డులో గ్రామానికి చెందిన మహేందర్ యాదవ్ గురుస్వామి 18 సార్లు అయ్యప్ప మాలధరణ చేసిన సందర్భంగా శనివారం మహా పడి పూజను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేసి పంచహారతులు ఇచ్చారు. అనంతరం 18 మెట్లపై కర్పూరాన్ని వెలిగించారు. నగరంలోని గుడిమల్కాపూర్ ప్రాంతానికి చెందిన కేశవ్ గురుస్వామి ఆధ్వర్యంలో పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ పూజకు అయ్యప్పభక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. గణపతి గురుస్వామితో పాటు భక్తులు పాల్గొన్నారు.



తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం చేస్తున్న జిల్లా పార్టీ అధ్యక్షుడు ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, ఎమ్మెల్యే వివేకానంద్, తదితరులు

కేసీఆర్‌ను సీఎం చేసేవరకు విశ్రమించొద్దు

బీఆర్ఎస్ విప్, ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

దుండిగల్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి) బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను మరోమారు ముఖ్యమంత్రిని చేసేవరకు ప్రతి నాయకుడు, కార్యకర్త దీక్షగా పని చేయాలని బీఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ పిలుపునిచ్చారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం గండిమైసమ్మలోని మేడ్చల్ - మల్కాజ్‌గిరి జిల్లా పార్టీ కార్యాలయంలో పార్టీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు ఆధ్వర్యంలో జరిగిన దీక్షా దివస్‌కు ఆయన మాజీ మంత్రి మల్లారెడ్డి, ఎమ్మెల్సీ నవీన్‌రావు, ఎమ్మెల్యేలు మాధవరం కృష్ణారావు, బండారి లక్ష్మారెడ్డి, మర్రి రాజశేఖర్‌రెడ్డి, పార్లమెంట్ ఇన్‌చార్జి రాగిడి లక్ష్మారెడ్డి, ఎంబీసీ మాజీ చైర్మన్ నందికంటి శ్రీధర్‌లతో కలిసి హాజరై కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అంతకుముందు తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిధిలోని ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, మహిళా నాయకులు, అనుంబంధ సంఘాల సభ్యులు, అభిమానులు పాల్గొన్నారు.

పులిచరకుంటలో అక్రమ లేఅవుట్ కూల్చివేత



లేఅవుట్‌ను ఎక్స్‌కవేటర్‌తో చదను చేయిస్తున్న మున్సిపల్ సిబ్బంది

ఘట్‌కేసర్, నవంబర్ 29(ఆంధ్రజ్యోతి): యథేచ్ఛగా అక్రమ లేఅవుట్ అంటూ శనివారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి మున్సిపల్ అధికారులు స్పందించి లేఅవుట్‌ను కూల్చివేశారు. ఘట్‌కేసర్ మున్సిపాలిటీ పరిధిలోని చందుపట్లగూడ పులిచరకుంటలోని ఎఫ్‌టీఎల్ పరిధిలో గతంలో మృతిచెందిన సర్పంచి సంతకాన్ని ఫోర్జరీ చేసి లేఅవుట్ రూపొందించి లేఅవుట్‌ను నిర్మించి ప్లాట్లను సైతం విక్రయించారు. దీంతో లేఅవుట్‌లో హద్దురాళ్లు పాతడం మున్సిపల్ అధికారులు తొలగించడం సాధారణమైంది. రెండు రోజులుగా హద్దురాళ్లు పాతి రోడ్లు ఏర్పాటు చేస్తున్న విషయాన్ని ఆంధ్రజ్యోతి వెలుగులోకి తీసుకురావడంతో స్పందించిన మున్సిపల్ అధికారులు చెరువులో చేసిన లేఅవుట్‌ను కూల్చి వేశారు. ఎక్స్‌కవేటర్‌తో పూర్తిగా హద్దురాళ్లను తొలగించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ రాజేష్ మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా లేఅవుట్లు కాని, నిర్మాణాలు గాని చేపడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

టెట్ నుంచి మినహాయింపునివ్వాలి



సభ్యత్వ నమోదులో టీఎస్ యుటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి

నవాబుపేట, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): సర్వీస్‌లో ఉన్న ఉపాధ్యాయులకు టెట్ తప్పనిసరి చేస్తూ ఇటీవల ప్రభుత్వం తీసుకొచ్చిన ఉత్తర్వులను రద్దు చేయాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సత్యనారాయణరెడ్డి, సుదర్శన్ డిమాండ్ చేశారు. శనివారం నవాబుపేట మండలంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. చించల్‌పేట్, అక్నాపూర్, నారేగూడ, గంగ్యాడ, ఎల్లకండ, లింగంపల్లి, పులుమామిడి, నవాబుపేట పాఠశాలల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టెట్ ఏర్పాటుకు ముందే నియామకమైన ఉపాధ్యాయులకు టెట్ పరీక్ష పెట్టడం విడ్డూరంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, ఉపాధ్యాయులు దేవయ్య, వీరయ్య, అనిల్‌కుమార్, ప్రదీప్‌కుమార్, అంజయ్య, సుధాకర్‌గౌడ్, గోపాల్, మైపాల్, జనార్దన్ ఉన్నారు.



ఊరే రాజకీయానికి పునాది

- ప్రజలకు చేరువగా ఉండేది సర్పంచ్ మాత్రమే..
- ఆకుతోటపల్లి మాజీ సర్పంచ్ శ్రీపాతి శ్రీనివాస్ రెడ్డి

ఆమనగల్లు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): రాజకీయ ఉన్నతికి సర్పంచ్ పదవి పునాదిగా నిలుస్తుంది. పల్లె ఉంచి రాజకీయ ప్రస్థానం మొదలుపెట్టిన ఎందరో మహా నేతలయ్యారు. ఉన్నత స్థాయి పదవులు అధిరోహించి జిల్లా, రాష్ట్ర స్థాయిలో గుర్తింపు పొందుతున్నారు. అందుకు ఆమనగల్లు మండలం ఆకుతోటపల్లి గ్రామానికి చెందిన సీనియర్ నాయకుడు శ్రీపాతి శ్రీనివాస్ రెడ్డి నిదర్శనంగా నిలిచాడు. 1988లో తొలిసారిగా ఆకుతోటపల్లి సర్పంచ్‌గా పోటీ చేసి 20 ఏళ్లపాటు సర్పంచ్‌గా పని చేశారు. 2000 సంవత్సరంలో ఉమ్మడి ఆమనగల్లు మండల జెడ్పీటీసీగా ఎన్నికయ్యారు. 2006లో ఆకుతోటపల్లి ఎంపీటీగా గెలుపొంది ఆమనగల్లు



మండల పరిషత్ ఉపాధ్యాక్షుడిగా వ్యవహరించారు. 1995, 2019లో శ్రీనివాస్ రెడ్డి సతీమణి శ్రీపాతి రజిత రెండు పర్యాయాలు ఆకుతోటపల్లి సర్పంచ్‌గా విజయం సాధించారు. ప్రజాభిమానంతో ఎదిగిన శ్రీనివాస్ రెడ్డి ఆనాటి రాజకీయాలు ఆదర్శంగా ఉండేవని చెబుతున్నారు. అప్పట్లో సర్పంచ్ పదవికి పోటీ చేసేందుకు కరపత్రాలు, బ్యాలెట్ గుర్తుల నమూనా ముద్రణ, మైకులు, భోజనం ఖర్చులకు రూ.20 వేలు ఖర్చు చేశానని పేర్కొన్నారు. ఓటర్లు మంచి నాయకుడిని ఎన్నుకున్నారే తప్ప పైసా ఆశించలేదని, ఇప్పుడు రాజకీయం పూర్తిగా మారిపోయిందని అభిప్రాయం వ్యక్తం చేశాడు.





మహేశ్వరం మండలం తుమ్మలూరు పంచాయతీ కార్యాలయం

ఊరూరా ఎన్నికల సందడి

పోటీకి సై అంటే సై అంటున్న అభ్యర్థులు

ఒక్కో ఊరిలో ముగ్గురు నుంచి ఐదుగురు పోటీ

ఓటర్లను ప్రసన్నం చేసుకునే పనిలో క్యాండేట్లు

మహేశ్వరం/కులకచర్ల, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికలు రానే వచ్చాయి. మొదటి విడత నామినేషన్ల ప్రక్రియ శనివారంతో పూర్తి కాగా రెండో విడత నామినేషన్లు ఆదివారం నుంచి ప్రారంభం కానుండగా మూడో విడత నామినేషన్ల స్వీకరణ డిసెంబర్ 3 నుంచి ప్రారంభం కానున్నాయి. ఇప్పటికే పల్లెల్లో రాజకీయ వేడి రాజుకుంది. సర్పంచ్, వార్డు పదవులకు సై అంటే సై అంటున్నారు.

మహేశ్వరం మండల పరిధిలో..

రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండల పరిధిలో 30 గ్రామ పంచాయతీలు, 258 వార్డులు ఉన్నాయి. మూడో విడత కింద డిసెంబర్ 3న నామినేషన్ల ప్రక్రియ మొదలు కానుండగా డిసెంబర్ 17న ఎన్నికలు జరగనున్నాయి. మండలంలో 30 గ్రామాలకు 6 పంచాయతీలు ఎస్టీలకు, ఆరు ఎస్సీలకు, నాలు బీసీలకు, 14 జనరల్‌కు కేటాయించారు. దీంతో మండలంలోని మేజర్ పంచాయతీలైన మహేశ్వరం, నాగారం, అమీర్‌పేట, తుమ్మలూరు, మన్‌సాన్ పల్లి, కోళ్లపడకల్, దుబ్బచర్ల, చిన్న తూప్రా, పెండ్యాల, కల్వకోల్ గ్రామాల్లో ఒక్కో గ్రామం నుంచి ముగ్గురి నుంచి ఐదుగురు పోటీలో ఉండేందుకు సిద్ధమవుతున్నారు. సర్పంచ్ పదవిపై కన్నేసిన నాయకులు ఓటుకు రూ.2 వేల నుంచి రూ.6 వేలకు పైగానే పంపిణీ చేయడంతోపాటు ఇతరాత్ర వస్తువులు కూడా పంచేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నట్లు సమాచారం.

- వికారాబాద్ జిల్లా కులకచర్ల మండల పరిధిలోని ప్రతి పల్లెలో ఎన్నికల హడావుడి కనిపిస్తోంది. మండలంలోని 33 గ్రామ పంచాయతీల్లో మూడో విడత డిసెంబరు 17న ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో డిసెంబర్ 3న నామినేషన్లు వేసేందుకు నువ్వా, నేనా అనే రీతిలో అభ్యర్థులు సిద్ధమవుతున్నారు. మండల పరిధిలోని పలు గ్రామాల్లో పలువురికి రిజర్వేషన్లు కలిసి రావడంతో పంచాయతీ పోరులో సై అంటే సై అంటున్నారు. మొత్తం 33 పంచాయతీలు ఉండగా అధికారులు 280 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. అధికార కాంగ్రెస్ పార్టీతో పాటు ప్రతిపక్ష పార్టీలైన బీఆర్ఎస్, బీజేపీ మద్దతుతో పంచాయతీ పోరులో పోటీకి పలువురు కాలు దువ్వుతున్నారు. పార్టీ గుర్తులపై ఎన్నికలు లేకపోవడంతో స్థానికంగా ఉన్న పలుకుబడి, వ్యక్తిగత పరిచయాలతో ఎన్నికల్లో పోటీ చేయాలని పలువురు భావిస్తున్నారు. పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ఏ గ్రామంలో ఎవరు ఏ పార్టీ మద్దతుతో నామినేషన్ వేస్తారో డిసెంబరు 3 వరకు వేచి చూడాల్సిందే.

సర్పంచ్ నుంచి కార్పొరేషన్ చైర్మన్ వరకు

కొడంగల్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): కొడంగల్ మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డి రాజకీయ ప్రస్థానం సర్పంచ్‌గా గెలుపొందిన తర్వాతే ప్రారంభమైంది. ఆయన 1969లో కొడంగల్ సర్పంచ్‌గా మొదటిసారి ఎన్నికయ్యారు. తర్వాత 1978, 1983, 1989, 1999, 2004 అసెంబ్లీ ఎన్నికల్లో కొడంగల్ నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసి గెలుపొందారు. ప్రస్తుతం గురునాథ్‌రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వంలో తెలంగాణ రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్‌గా కొనసాగుతున్నారు. గురునాథ్‌రెడ్డికి దాదాపు 60 ఏళ్ల రాజకీయ ప్రస్థానం ఉంది.



గురునాథ్‌రెడ్డి, పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్

చెత్తడబ్బా.. బ్లాక్ బోర్డు

సర్పంచ్ అభ్యర్థులకు 30... వార్డు సభ్యులకు 20 గుర్తుల కేటాయింపు

పంచాయతీ ఎన్నికల్లో గుర్తులు ఖరారు

అక్షర క్రమంలో కేటాయించనున్న రిటర్నింగ్ అధికారులు

అభ్యర్థులు నచ్చకుంటే నోటాకు ఓటేసే అవకాశం

వికారాబాద్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): గ్రామ పంచాయతీ ఎన్నికల్లో అభ్యర్థుల విజయావకాశాల్లో గుర్తులు చాలా కీలక పాత్ర పోషిస్తాయి. ఎన్నికల బరిలో నిలిచే అభ్యర్థులు ప్రజలు ఎక్కువగా గుర్తుంచుకునే గుర్తులు తమకు రావాలని కోరుకుంటారు. రిటర్నింగ్ అధికారులు కేటాయించే గుర్తులపైనే అభ్యర్థుల విజయావకాశాలు ఎక్కువగా ఆధారపడి ఉంటుందంటే అతిశయోక్తి కాదు. ఎంపీటీసీ, జెడ్పీటీసీ మొదలుకొని అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల వరకు అన్నీ పార్టీల గుర్తులపైనే కొనసాగుతాయి. స్వతంత్ర అభ్యర్థులకు మినహా జాతీయ, రాష్ట్ర, రిజిస్టర్డ్ పార్టీల తరఫున పోటీ చేసే అభ్యర్థులకు ఆ పార్టీల గుర్తులనే కేటాయిస్తారు. అయితే పార్టీలకతీతంగా జరిగే పంచాయతీ ఎన్నికల్లో మాత్రం అభ్యర్థుల భవితవ్యం ఎక్కువగా రిటర్నింగ్ అధికారులు కేటాయించే గుర్తులపైనే ఆధారపడి ఉంటుంది. పంచాయతీ ఎన్నికల్లో అభ్యర్థులకు కేటాయించేందుకు మొత్తం 50 గుర్తులను ఎన్నికల సంఘం ఖరారు చేసింది. సర్పంచ్ అభ్యర్థులకు 30 గుర్తులు, వార్డు సభ్యులకు 20 గుర్తులను కేటాయించింది. నామినేషన్ల ఉప సంహరణ అనంతరం ఎన్నికల బరిలో మిగిలే అభ్యర్థులకు గుర్తులను కేటాయించ



నున్నారు. సర్పంచ్ అభ్యర్థుల బ్యాలెట్ పేపర్ గులాబీ(పింక్) రంగులో, వార్డు సభ్యుల బ్యాలెట్ పేపర్ తెలుపు రంగులో ఉండనున్నాయి.

గుర్తుల కేటాయింపు ఇలా..

నామినేషన్ల ఉప సంహరణ సమయం ముగిసిన తర్వాత రిటర్నింగ్ అధికారి ఎన్నికల బరిలో నిలిచే అభ్యర్థుల జాబితాను అక్షర క్రమంలో సిద్ధం చేయాల్సి ఉంటుంది. ఇద్దరు, అంత కంటే ఎక్కువ మందికి ఒకే పేరు ఉండి వేర్వేరు ఇంటి పేర్లు ఉంటే వారి ఇంటి పేర్లను సూచిస్తూ అక్షర క్రమంలో అమర్చనున్నారు. ఇద్దరు, అంతకంటే ఎక్కువ మంది అభ్యర్థులకు ఒకే పేరు, ఒకే ఇంటి పేరు ఉంటే వారి వృత్తి, నివాసం, అడ్రస్ ప్రతిపాదికన జాబితాలో చేర్చనున్నారు. సర్పంచ్ పదవికి గుర్తించిన గుర్తుల జాబితాలో అక్షర క్రమంలో మొదటి అభ్యర్థికి మొదటి గుర్తును కేటాయిస్తారు. ఆ తర్వాత గుర్తును జాబితాలోని రెండో అభ్యర్థికి, ఆ తర్వాత మిగిలిన గుర్తులను అక్షర క్రమంలో తర్వాత ఉన్న అభ్యర్థులకు ఖరారు చేస్తారు. వార్డు సభ్యులకు గుర్తులను ఇదే విధానంలోనే కేటాయిస్తారు.

సర్పంచ్ అభ్యర్థుల గుర్తులు...

సర్పంచ్ అభ్యర్థులకు ఉంగరం, కత్తెర, బ్యాట్, ఫుట్ బాల్, లేడీస్ పర్సు, టూత్‌పేస్ట్, టీవీ రిమోట్, స్పానర్, చెత్త డబ్బా, బ్లాక్ బోర్డు, బెండకాయ, కొబ్బరి తోట, వజ్రం, బకెట్, డోర్ హ్యాండిల్, ఛాయ్ జల్లెడ, చేతి కర్ర, మంచం, పలక, టేబుల్, బ్యాటరీ లైట్, బ్రష్, బ్యాట్స్‌మెన్, తెర చాపతో పడవ, బిస్కెట్, ఫ్లూట్, చైన్, చెప్పులు, బెలూన్, క్రికెట్ స్టంప్స్ గుర్తులు కేటాయించారు.

వార్డు సభ్యుల గుర్తులు

వార్డు సభ్యుల అభ్యర్థులకు గౌను, గ్యాస్‌పొయ్యి, స్టూల్, గ్యాస్ సిలిండర్, బీరువా, విజిల్, కుండ, డిష్ యాంటీనా, గరాటా, మూకుడు, ఐస్‌క్రీమ్, గాజు గ్లాస్, పోస్ట్ డబ్బా, ఎన్వలప్ కవర్, హాకీ స్టిక్ బాల్, నెక్ టై, కటింగ్ ప్లేయర్, పెట్టె, విద్యుత్ స్తంభం, టీ కేటిల్ గుర్తులను కేటాయించారు. కాగా, పంచాయతీ ఎన్నికల్లో నోటాకు కూడా గుర్తు కేటాయించనున్నారు. బ్యాలెట్ పేపర్‌పై నోటాకు ఓటు వేయాలనుకునే వారు కొట్టివేత మార్క్‌కు వేసే అవకాశం కల్పించారు. బ్యాలెట్ పేపర్‌లో అందరు అభ్యర్థుల తర్వాత నోటా గుర్తు ముద్రిస్తారు.



నామినేషన్ ర్యాలీలో

సినీనటుడి సందడి

కేశంపేట, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల్లో సినీ నటులు సందడి చేస్తున్నారు. కేశంపేట మండలం కొండారెడ్డిపల్లి గ్రామ సర్పంచ్ అభ్యర్థిగా పల్లె ఆనంద్ కుమార్ శనివారం భారీ ర్యాలీతో వెళ్లి నామినేషన్ దాఖలు చేశారు. ఈ నామినేషన్ ర్యాలీలో సినీనటుడు ఇంద్రసేన సందడి చేశారు. ఆనంద్ కుమార్‌కు మద్దతుగా ర్యాలీలో పాల్గొని ఆయనకు ఓటు వేయాల్సిందిగా పిలుపునిచ్చారు. ఇంద్రసేనను చూడటానికి గ్రామస్తులు ఆసక్తి చూపారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు

మాడ్గుల, నవంబర్ 29(ఆంధ్రజ్యోతి): మాడ్గుల మండలంలో 34 గ్రామ పంచాయతీలు ఉండగా ఎన్నికలు సజావుగా జరిగేందుకు ప్రజలు, నాయకులు సహకరించాలని సీఐ వేణుగోపాల్ కోరారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. గత గ్రామ పంచాయతీ ఎన్నికల సమయంలో కలకలం సృష్టించి, వివిధ నేరాలకు పాల్పడిన కొల్కులపల్లి, కలకొండ, గ్రామాలకు చెందిన 60 మందిని మాడ్గుల తహసీల్దార్ వినయ్‌సాగర్ ఎదుట బాండోవర్ చేసినట్లు తెలిపారు.

నిలబడేదెవ్వరు.. తలబడేదెవ్వరు!

అభ్యర్థుల ఎంపికలో తలమునకలైన ప్రధానపార్టీలు



ధారూరు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా పంచాయతీ ఎన్నికల వేడి రాజుకుంటోంది. ప్రధాన పార్టీలు అభ్యర్థుల కోసం సమాలోచనలు చేస్తున్నాయి. మండల పరిధిలో 34 గ్రామ పంచాయతీలుండగా రెండో విడతల్లో ఎన్నికలు జరుగనున్నాయి. సర్పంచ్ స్థానాలకు సంబంధించి ఎస్సీలకు 6, ఎస్టీలకు 6, బీసీలకు 6, జనరల్‌కు 16 పంచాయతీలు రిజర్వు చేశారు. వీటితోపాటు వార్డు సభ్యుల స్థానాలను ఖరారు చేశారు. పార్టీ చిహ్నాలు లేకుండా ఏదో ఒక పార్టీ బలంతోనే సర్పంచు, వార్డు సభ్యుల స్థానాలకు అభ్యర్థులు పోటీ పడుతుంటారు. ప్రస్తుతం గ్రామాల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు తమ అభ్యర్థులను రంగంలో దించేందుకు సన్నద్ధమవుతున్నాయి. స్థానికంగా పలుకుబడి, ఎన్నికలలో ఖర్చు పెట్టే స్థోమత ఉన్న వారినే ఎన్నికల బరిలో దింపేలా ఆయా పార్టీల నేతలు యోచిస్తున్నారు. ఇప్పటికే అభ్యర్థుల ఎంపికపై ఈ మూడు పార్టీలు సమావేశాలు నిర్వహించాయి. అయితే మహిళలకు రిజర్వు అయిన స్థానాలోల ఎన్నికల సందడి తక్కువగా కనిపిస్తోంది.

ఏకగ్రీవంపై ఏం చేద్దాం



సమావేశంలో టీపీసీసీ సభ్యుడు శ్రీనివాస్ గౌడ్, మాజీ ఎంపీపీలు సిరోలిపంతూ, కమ్లీమోత్యానాయక్, నాయకులు

మైసిగండి తండాలో గ్రామస్తుల సమావేశం

పోటీకి సిద్ధమైన వారితో చర్చలు

పెద్ద సంఖ్యలో పాల్గొన్న తండావాసులు, నాయకులు

కడ్తాల్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): ఏకగ్రీవాల్లో ఆదర్శంగా నిలుస్తున్న కడ్తాల మండలం మైసిగండి పంచాయతీ ప్రజలు ఈ దఫా కూడా సర్పంచ్, వార్డు సభ్యులను ఏకగ్రీవం చేసుకోవడానికి ప్రయత్నాలు సాగిస్తున్నారు. రిజర్వేషన్లలో భాగంగా జనరల్ మహిళకు కేటాయించిన సర్పంచ్ పదవిపై ఎనిమిది మంది ఆశలు పెంచుకొని పావులు కదుపుతున్నారు. ఈ క్రమంలో ఆశావహులతో శనివారం గ్రామ నాయకులు, పెద్దలు మైసిగండిలో సమావేశమయ్యారు. పోటీకి సిద్ధమైన ఎనిమిది మంది అభిప్రాయాలు తీసుకున్నారు. సర్పంచ్ అభ్యర్థిని ఏకగ్రీవం చేసుకుందామని నాయకులు చర్చలు నిర్వహించారు.

ఐక్యతను చాటుదాం

సమావేశానికి హాజరైన టీపీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్ గౌడ్, మాజీ ఎంపీపీలు సీరోలిపంతూ, కమ్లీమోత్యానాయక్, మాజీ సర్పంచ్‌లు తులసీరామ్‌నాయక్, శేఖర్‌గౌడ్ మాట్లాడారు. సర్పంచ్ ఎన్నికల్లో పాలకవర్గాన్ని ఏక గ్రీవం చేసుకొని ఐక్యతను చాటాలని పిలుపునిచ్చారు. పంతాలకు పోయి నష్టపోవద్దని, ఒక నిర్ణయానికి వచ్చి సర్పంచ్‌ను ఏకగ్రీవం చేసుకుందామన్నారు. దీనిపై మరోసారి సమావేశం నిర్వహించి ఏకాభిప్రాయానికి రావాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు తులసీరామ్‌నాయక్, జవహర్‌లాల్ నాయక్, రాందాస్ నాయక్, సక్రి, పుష్ప, హీరాసింగ్, శేఖర్‌గౌడ్, బిక్కునాయక్, రెడ్యానాయక్, దూద్యానాయక్, రాజారామ్, బీచ్యానాయక్, పంత్యానాయక్, పాండ్యానాయక్, పాండునాయక్, దేవ నాయక్, అనిల్‌నాయక్, కిషన్, రాజా, అమ్మ, శంకర్, అమర్‌సింగ్, భాస్కర్, అరున్, సుందర్, బుజ్జ, శివులా, గోపాల్, రమేశ్, నర్సింహ్మా, బాబా, చిన్న, తదితరులు ఉన్నారు.

ఎస్టీలు లేకున్నా రిజర్వేషన్

షాబాద్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): మండలంలో ముద్దెంగూడ, నాగర్‌కుంట గ్రామ పంచాయతీల్లో ఎస్టీలు లేకున్నా వార్డులకు ఎస్టీ ఎస్టీ రిజర్వేషన్ కల్పించారు. ముద్దెంగూడలో మూడో వార్డు, నాగర్‌కుంటలో ఎనిమిదవ వార్డు ఎస్టీలకు రిజర్వు అయ్యింది. ఈ రెండు గ్రామాల్లో అసలు ఎస్టీ ఒటర్లే లేరు. దీంతో ఆ వార్డుల్లో పోటీ చేసేందుకు అభ్యర్థులు లేరు. ముద్దెంగూడలో ఎనిమిది వార్డులకు ఏడు, నాగర్‌కుంటలో పది వార్డులకు తొమ్మిది వార్డులకు మాత్రమే ఎన్నిక జరగనుంది. దీనిపై ఆయా గ్రామాలకు చెందిన పలువురు శనివారం ఎంపీడీవో అపర్ణకు ఫిర్యాదు చేశారు.



వార్డుల జాబితాను చూపిస్తున్న నాగర్‌కుంట, ముద్దెంగూడ గ్రామస్తులు


ప్రశాంత ఎన్నికలకు సహకరించాలి

డీసీపీ రాజేశ్

శంషాబాద్ రూరల్, నవంబర్ 29 (ఆంధ్రజ్యోతి): ఎన్నికలు సాజావుగా సాగేందుకు ప్రజాప్రతినిధులు, ప్రజలు సహకరించాలని డీసీపీ రాజేశ్ కోరారు. శనివారం మండల పరిధిలోని నర్కూడ నామినేషన్ సెంటర్‌ను ఏసీపీ శ్రీకాంత్‌గౌడ్‌తో కలిసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఇప్పటికే ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భారీ పోలీస్ బందోబస్తూ ఏర్పాటు చేశామని తెలిపారు. శంషాబాద్ మండలంలో 14 సమస్యాత్మక గ్రామాలుగా గుర్తించామని, ఆయా పంచాయతీల్లో భారీ బందోబస్తూ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఇప్పటికే మండలంలో నర్కూడ, పాల్మాకుల వద్ద రెండు చెక్‌పోస్టులను ఏర్పాటు చేశామని, అక్రమంగా డబ్బులు, మద్యం తరలిస్తే కేసులు నమోదు చేసి, మద్యం, డబ్బులు సీజ్ చేస్తామని హెచ్చరించారు. ఏసీపీ శ్రీకాంత్‌గౌడ్ పాల్మాకుల నామినేషన్ సెంటర్‌ను, సీఐ నరేందర్‌రెడ్డి చెక్‌పోస్టును సందర్శించారు. అలాగే మదన్‌పల్లిలో నామినేషన్ కేంద్రాన్ని పరిశీలించారు. ఎన్నికల అధికారులకు పలు సూచనలు చేశారు.




నర్కూడలో నామినేషన్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న డీసీపీ రాజేశ్, ఏసీపీ



అభ్యర్థుల వేటలో..

కులకచర్ల, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): గెలుపు గుర్రాల కోసం ప్రధాన పార్టీల నేతలు అన్వేషణ మొదలు పెట్టారు. గ్రామాల్లో సర్పంచ్, వార్డు సభ్యులుగా బరిలో దించేందుకు కాంగ్రెస్ నాయకులు కసరత్తు ప్రారంభించారు. డీసీసీ ఉపాధ్యక్షుడు భీమ్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు, మార్కెట్ కమిటీ చైర్మన్ బీఎస్.ఆంజనేయులు, కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి గోపాల్‌నాయక్ గ్రామాల వారీగా అభ్యర్థులను అన్వేషిస్తున్నారు. ప్రతీ గ్రామంలో ఇద్దరు లేదా ముగ్గురి పేర్లు తీసుకుంటున్నారు. ఆయా గ్రామాల కార్యకర్తల అభిప్రాయం మేరకు అభ్యర్థిని నిర్ణయించనున్నారు. ముజాహిద్‌పూర్ బీసీ జనరల్ కావడంతో కాంగ్రెస్ సర్పంచ్ అభ్యర్థిగా చంద్రభూపాల్, ఉప సర్పంచ్ భీమయ్యను కార్యకర్తలు నిర్ణయించారు. బీఆర్ఎస్, బీజేపీ నాయకులు కూడా అభ్యర్థుల ఎంపికలో నిమగ్నమయ్యారు. కులకచర్ల కూడా బీసీ జనరల్ కావడంతో బీజేపీలో తీవ్ర పోటీ నెలకొంది. గ్రామాల్లో ఒక్కసారిగా రాజకీయం వేడెక్కింది. ఇప్పటికే రిజర్వేషన్‌లు ఖరారు కావడంతో గ్రామాల్లో సర్పంచ్ బరిలో ఉండే వ్యక్తులు కుల సంఘాలు, గ్రామ ప్రజలను ప్రసన్నం చేసుకుంటున్నారు. కులకచర్ల మండలంలో 33 గ్రామ పంచాయతీలు ఉండగా 280 వార్డులున్నాయి. సర్పంచ్ నామినేషన్‌కు కేవలం ఐదు రోజులు గడువు ఉండటంతో అందరి గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి.



యాచారం మండలం మేడిపల్లిలో ముసుగు లేని వైఎస్ విగ్రహం

కోడ్ పాటించరేం!

యాచారం, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): ఎన్నికల కోడ్ అమలులో ఉన్నా నిబంధనలను అధికారులు అమలుచేయడం లేదు. మండలంలోని నజ్దిక్‌సింగారం, మేడిపల్లి, గున్‌గల్ గ్రామాల్లో ఉన్న మాజీ సీఎం వైఎస్ రాజశేఖర్ విగ్రహాలకు అధికారులు ముసుగు వేయలేదు. ఎన్నికల నిబంధనలు అమలులోకి రాగానే ఆయా గ్రామాల్లో ఉన్న వివిధ రాజకీయ పార్టీల నేతల విగ్రహాలకు ముసుగులు, పార్టీల జెండాలకు రంగులు వేయడం లేదు. పార్టీల జెండాల దిమ్మెలకు రంగులు వేయడంలేదా గోనె సంచులతో ముసుగువేయాల్సి ఉన్నా ఆయా గ్రామాలకు చెందిన పంచాయతీ కార్యదర్శులు పట్టించుకోవడం లేదని ఆరోపణలు వస్తున్నాయి.

రోడ్ల వెంట దుప్పట్ల పంపిణీ





షాద్‌నగర్ మున్సిపల్ కార్మికులకు దుప్పట్లు ఇస్తున్న యువకులు

షాద్‌నగర్ అర్బన్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): ఎముకలు కొరిచే చలిలో ఆరు బయట నిద్రిస్తూ వణుకుతున్న అభాగ్యుల పట్ల యువకులు ఔదార్యం చూపారు. దుప్పట్లు కప్పి మానవత్వం చాటుకున్నారు. షాద్‌నగర్ ఈడెన్ గార్డెన్ నిర్వాహకుడు జైద్ అబ్దుల్లా ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి షాద్‌నగర్ బస్టాండ్, రైల్వే స్టేషన్‌తో పాటు ఫుట్ పాత్‌లపై చలికి నిద్రిస్తున్న వారికి దుప్పట్లు కప్పుతూ వెళ్లారు. పారిశుధ్య కార్మికులకు సైతం దుప్పట్లు ఇచ్చారు. బస్టాండ్, రైల్వే స్టేషన్, హైదరాబాద్‌లోని ఉస్మానియా, పేట్ల బురుజు ఆవరణల్లో నిద్రిస్తున్న వారికి సైతం దుప్పట్లు ఇచ్చినట్లు జైద్ అబ్దుల్లా ఈ సందర్భంగా తెలిపారు.

నామినేషన్లను పక్కాగా పరిశీలించాలి

కేశంపేట, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): అభ్యర్థులు వేస్తున్న నామినేషన్ పత్రాల్లో పేర్కొన్న వివరాలను పక్కాగా పరిశీలించాలని ఎంపీడీవో రవిచంద్రకుమార్‌రెడ్డి అధికారులకు సూచించారు. శనివారం పాపిరెడ్డిగూడ, ఇప్పలపల్లి, వేములనర్వ, సంగెం, అల్వాల, కొత్తపేట, నిర్దవెల్లి, తొమ్మిది రేకుల, కేశంపేట నామినేషన్ కేంద్రాలను పరిశీలించారు. ప్రతి అభ్యర్థి పూర్తి వివరాలు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. నామినేషన్ కేంద్రం వద్ద బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు.

ఉన్నత విద్యతో ఉజ్వల భవిష్యత్తు



విద్యార్థులకు నాసా కిట్స్ పంపిణీ చేసిన రఘువీర్ నర్సింగ్

ఆదిభట్ల, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): ఉన్నత విద్యతో ఉజ్వల భవిష్యత్తు వస్తుందని గురునానక్ ఇంజినీరింగ్ సివిల్ డిపార్ట్‌మెంట్ హెచ్‌వోడీ రఘువీర్ నర్సింగ్ అన్నారు. శనివారం ఇబ్రహీంపట్నంలోని శ్రీచైతన్య స్కూల్ విద్యార్థులకు నాసా కిట్స్ పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పాఠశాల స్థాయి నుండే ప్రణాళిక ప్రకారం చదివి ఉన్నత శిఖరాలను చేరుకోవాలన్నారు. విద్యార్థులకు ప్రశ్నలు వేస్తూ స్పేస్‌కి సంబంధించిన విషయాలను వివరించారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ శ్రీధర్, ఏజీఎం వెంకట్‌గౌడ్, వైస్ ప్రిన్సిపల్ శ్రావణి, టీచర్లు ప్రవీణ్, శశికాంత్ పాల్గొన్నారు.

'బీఆర్ఎస్ అభ్యర్థులకే పట్టం కట్టండి'

షాబాద్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): సర్పంచ్ ఎన్నికల్లో బీఆర్ఎస్ బలపర్చిన అభ్యర్థులనే గెలిపించాలని మాజీ జెడ్పీటీసీ పట్నం అవినాష్‌రెడ్డి అన్నారు. శనివారం షాబాద్‌లో దీక్ష దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. 14ఏళ్ల పోరాటం చేసి తెలంగాణ రాష్ట్రాన్ని సిధించిన ఘనత కేసీఆర్‌కే దక్కిందన్నారు. సర్పంచ్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు నర్సింగ్‌రావు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎంపీటీసీలు మద్దూరి పాండు, మాజీ సర్పంచులు దర్శన్, నర్సింహారెడ్డి, అనిత, పార్టీ నాయకులు సుదర్శన్, నాగేందర్‌రెడ్డి, ఒగ్గు రాజు, ఇమ్రాన్, వెంకట్‌రెడ్డి పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

గుండె పోటుతో సీపీఎం నాయకుడి మృతి



బ్రహ్మయ్య(ఫైల్)

యాచారం, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): మండల సీపీఎం సీనియర్ నాయకుడు పెండ్యాల బ్రహ్మయ్య(50) శనివారం గుండె పోటుతో మరణించారు. ఆయన తన పొలంలో పని చేస్తుంగా గుండెపోటుకు గురయ్యాడు. ఆయనను కుమారుడు రవి చికిత్స కోసం ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

ఉద్యాన రైతుల ఖాతాల్లో రూ.10వేలు జమ

యాచారం, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): జిల్లాలో కూరగాయలు సాగుచేస్తున్న రైతులకు ప్రోత్సాహకంగా వారి ఖాతాల్లో రూ.పదివేల చొప్పున జమచేశామని జిల్లా ఉద్యానవనశాఖ అధికారి సురేష్ శనివారం చెప్పారు. గడ్డమల్లయ్యగూడ, మొండిగౌరెల్లి, చౌదర్‌పల్లి గ్రామాల్లో కూరగాయలు సాగును పైలెట్ ప్రాజెక్టుగా తీసుకున్నామని, పదివేల విలువైన ప్లాస్టిక్ బుట్టలను అందిస్తున్నామని తెలిపారు.

రెండో విడత ఎన్నికలకు నామినేషన్లు

నేటి నుంచి

ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు



చేవెళ్ల, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ రెండో విడత ఎన్నికల సర్పంచ్, వార్డు సభ్యులకు నామినేషన్ల స్వీకరణ ఆదివారం (నేటి నుంచి) మొదలు కానుంది. మూడు రోజుల పాటు ఆయా క్లస్టర్లలో అధికారులు నామినేషన్లు స్వీకరిస్తారు. ఇందుకు అధికారులు ఏర్పాట్లు పూర్త చేశారు. చేవెళ్ల డివిజన్‌లోని చేవెళ్ల, షాబాద్, శంకర్‌పల్లి, మొయినాబాద్ మండలాల్లో ఉన్న 109 పంచాయతీలు, 946 వార్డులకు నామినేషన్లు ఆయా క్లస్టర్లలో స్వీకరిస్తారు. ఈ నెల 30 నుంచి డిసెంబరు 2వ తేదీ వరకు నామినేన్ల స్వీకరణ ఉంటుంది. ఉదయం 10నుంచి సాయంత్రం 5గంటల వరకు నామినేషన్లు తీసుకుంటారు. ఆలూరు, కౌకుంట్ల, కమ్మెట, న్యాలట, చన్వెల్లి, ఖానాపూర్, గుండాల, ముడిమ్యాల్ క్లస్టర్లలో నామినేషన్లు స్వీకరిస్తామని చేవెళ్ల ఎంపీడీవో హిమబిందు పేర్కొన్నారు.

మొయినాబాద్ రూరల్: పంచాయతీ ఎన్నికలకు నేటి నుంచి ఐదు క్లస్టర్లలో నామినేషన్లు స్వీకరిస్తామని ఎంపీడీవో సంధ్యరాణి తెలిపారు. మండలంలో 19 పంచాయతీలు, 166 వార్డులు.. 30,250 మంది ఓటర్లు ఉన్నారన్నారు.

శంకర్‌పల్లి: మండలంలోని ఆయా క్లస్టర్లలో నేటి నుంచి నామినేషన్లు స్వీకరిస్తామని శంకర్‌పల్లి ఎంపీడీవో వెంకయ్యగౌడ్ తెలిపారు. మండల పరిషత్‌లో శనివారం అధికారులతో అవగాహన సమావేశం నిర్వహించారు. ఎన్నికల నిర్వహణ బాధ్యత క్లస్టర్ల ఆర్వోలు, పంచాయతీ సెక్రటరీలదేనని స్పష్టం చేశారు. కుల ధ్రువీకరణ పత్రం కోసం ఆదివారం నాడు కూడా రెవెన్యూ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ప్రత్యేకాధికారి సురేష్ బాబు, తహసీల్దార్ సురేందర్, శంకర్‌పల్లి సీఐ శ్రీనివాస్, ఎంపీవో గిరిరాజ్ ఉన్నారు.

ఆమనగల్లు: ఆమనగల్లు, కడ్తాల్, తలకొండపల్లి మండలాల్లో పంచాయతీ ఎన్నికల రెండో విడత నామినేషన్లకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆమనగల్లు మండలంలో 13 సర్పంచ్, 112 వార్డులు, కడ్తాలలో 24 పంచాయతీలు, 210 వార్డులు, తలకొండపల్లి మండలంలో 32 పంచాయతీలు, 272వార్డులకు ఎన్నికలు నిర్వహిస్తారు. తలకొండపల్లి మండలంలో 11క్లస్టర్లలో నామినేషన్లు స్వీకరిస్తామని ఎంపీడీవో శ్రీకాంత్ తెలిపారు. ఇప్పటికే బ్యాలెట్ బాక్స్‌లు మండల కేంద్రానికి చేరుకున్నాయన్నారు. మండలంలో 37,858 మంది ఓటర్లు ఉన్నట్లు తెలిపారు. కడ్తాల మండలంలో నామినేషన్ల స్వీకరణకు ఏడు క్లస్టర్లను ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో సుజాత తెలిపారు. కడ్తాల మండలంలో 34,122 మంది ఓటర్లు ఉన్నట్లు తెలిపారు. ఆమనగల్లు మండలంలో నామినేషన్ల స్వీకరణకు నాలుగు క్లస్టర్లను ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో కుసుమమాధురి చెప్పారు. మండలంలో 14,712 మంది ఓటర్లు ఉన్నారని వివరించారు. ఇదిలా ఉంటే నామినేషన్ల స్వీకరణకు గడువు ఉండే మూడు రోజుల్లో మంచి రోజును చూసుకొని నామినేషన్ వేయాలని ఆశావహులు అనుకుంటున్నారు. శుభముహూర్తాల కోసం అర్చకుల వద్దకు పరుగులు తీస్తున్నారు. ఆది, సోమవారాల్లో ముహూర్తాలు బాగున్నట్లు పురోహితులు విడమర్చి చెబుతున్నారు. కొందరి పేరిట మంగళవారం సైతం బాగానే ఉందని ధీమా ఇస్తున్నారు.

భారీ ర్యాలీలతో నామినేషన్ల దాఖలు



నామినేషన్ దాఖలు చేస్తున్న గడ్డం శేఖర్‌యాదవ్



షాద్‌నగర్ రూరల్: దూసకల్‌లో నామినేషన్లకు లైన్లో నిల్చున్న అభ్యర్థులు

శంషాబాద్ రూరల్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): మొదటి విడత పంచాయతీ ఎన్నికల నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ శవావారం ముగిసింది. చివరి రోజు సర్పంచ్, వార్డు స్థానాలకు ర్యాలీలతో వచ్చి నామినేషన్ వేశారు. నర్కూడలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గడ్డం శేఖర్‌యాదవ్ తన పార్టీ నాయకులు, కార్యకర్తలతో భారీ ర్యాలీతో వచ్చి నామినేషన్ దాఖలు చేశారు. అలాగే బీజేపీ బలపర్చిన అభ్యర్థి కుమార్‌యాదవ్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో భారీ ర్యాలీ నిర్వహించి నామినేషన్ దాఖలు చేశారు. అలాగే పెద్ద షాపూర్‌లో బీఆర్ఎస్ బలపర్చిన దేవులపల్లి సునీతసత్యనారాయణగౌడ్ కార్యకర్తలతో, నాయకులతో బాజాభజంత్రిలతో వచ్చి నామినేషన్ దాఖలు చేశారు. చౌదరిగూడ, కవ్వగూడ, సుల్తాన్‌పల్లి, పాల్మాకుల సర్పంచ్ అభ్యర్థులు కూడ భారీ ర్యాలీలు నిర్వహించిన నామినేషన్లు దాఖలు చేశారు. కార్యక్రమాల్లో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బుక్క వేణుగోపాల్, మాజీ జడ్పీటీసీ నీరటి తన్వీరాజు పాల్గొన్నారు. శంషాబాద్ మండలంలో 21 పంచాయతీలకు 155 మంది, వార్డు పదవులకు 761మంది నామినేషన్ వేశారు. నామినేషన్ సెంటర్లలోకి అభ్యర్థులు తప్ప వేరెవరినీ అనుమతించడం లేదు.

కొత్తూర్: నామినేషన్ల చివరి రోజు సర్పంచ్, వార్డు పదవులకు పోటీచేసే అభ్యర్థులు తరలివచ్చారు. కొడిచర్ల, సిద్దాపూర్ నామినేషన్ కేంద్రాల్లో రాత్రి వరకు నామినేషన్ల పర్వం కొనసాగింది. మండలంలో 12 గ్రామపంచాయతీలకు చివరి రోజు సర్పంచ్ పదవులకు 52, వార్డుసభ్యులకు 249 నామినేషన్లు వచ్చాయి. మొత్తం సర్పంచ్‌లకు 79, వార్డు సభ్యులకు 347 నామినేషన్లు వచ్చాయి.

షాద్‌నగర్: నామినేషన్ల చివరి రోజు శనివారం నామినేషన్ కేంద్రాలు కిక్కిరిసాయి. షాద్‌నగర్ నియోజకవర్గంలో మొత్తం 153 గ్రామపంచాయతీల్లో పెద్ద ఎత్తున నామినేషన్లు దాఖలయ్యాయి. కొన్ని చోట్ల సర్పంచ్ పదవికి 20 నుంచి 25మంది నామినేషన్లు వేశారు. వార్డు స్థానాలకు సైతం వందల్లో నామినేషన్లు వేశారు.

నేడు పరిశీలన

ఎన్నికల అధికారులు నామినేషన్లు ఆదివారం పరిశీలిస్తారు. అవగాహన లేక నామినేషన్ పత్రాలను పూర్తిస్థాయిలో నింపలేదని కొందరు అభ్యర్థులు తెలిపారు. కాగా 31న నామినేషన్ల ఉపసంహరణ పోటీలోని అభ్యర్థుల సంఖ్య తేలనుంది.

షాద్‌నగర్ రూరల్: మండలంలోని కిషన్‌నగర్, మొగిలిగిద్ద, చించోడు నామినేషన్ కేంద్రాల్లో శనివారం రాత్రి 9గంటల వరకు నామినేషన్లు వేసేందుకు అభ్యర్థులు లైన్లలో నిలబడ్డారు. అభ్యర్థులు ఎక్కువ మంది ఉండటంతో అధికారులు టోకెన్లు ఇచ్చారు. 47 సర్పంచ్ పదవులకు 309 మంది, వార్డు సభ్యులకు 1,136 మంది నామినేషన్లు వేశారని ఎంపీడీఓ బన్సీలాల్ తెలిపారు.



శంషాబాద్ రూరల్: నర్కూడలో నామినేషన్ కార్యక్రమానికి వస్తున్న కాంగ్రెస్ నాయకులు



షాద్‌నగర్ రూరల్: కిషన్‌నగర్‌లో నామినేషన్ వేసేందుకు రాత్రి వరకు వేచి ఉన్న మహిళలు



షాద్‌నగర్: ఎలికట్ట వద్ద అభ్యర్థుల సందడి

కాంగ్రెస్ బలపర్చిన వారిని గెలిపించుకుందాం



కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మధుసూదన్‌రెడ్డి, చంద్రశేఖర్

షాబాద్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయితీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించుకుందామని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి అన్నారు. శనివారం హైతాబాద్, ఆస్పల్లిగూడ గ్రామాల బీఆర్ఎస్ నాయకులు సత్తయ్య, సంజీవ, రాములు, నవీన్, రాములు కార్యకర్తలతో కలిసి మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు. ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వ సంక్షేమ పథకాలకు ఆకర్షితులై వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరుతున్నారన్నారు. పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలన్నారు. కార్యక్రమంలో గుడిమల్కాపూర్ ఏఎంసీ వైస్‌చైర్మన్ చంద్రశేఖర్, నాయకులు సంజీవరెడ్డి, వెంకట్‌రెడ్డి, ఖాజామియా, అంజనేయులుగౌడ్, రవీందర్‌రెడ్డి, రషీద్‌పటేల్, జహంగీర్, యాదయ్య పాల్గొన్నారు.

క్రైం కార్నర్

అక్రమ మద్యం పట్టివేత

చౌదరిగూడ, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): అక్రమంగా తరలిస్తున్న మూడు మద్యం కాటన్లను జిల్లేడ్ చౌదరిగూడ పోలీసుల పట్టుకున్నారు. శనివారం లాల్‌పహాడ్‌లో వాహనాలను తనిఖీ చేస్తుండగా వనంపల్లికి చెందిన ఆంజనేయులు, మల్లేశ్‌లు బెల్ట్ షాపునకు తరలిస్తున్న మద్యం పట్టుబడింది. మూడు కాటన్ల బీర్, కారు సీజ్ చేశారు. కానిస్టేబుల్ ప్రహ్లాద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై విజయ్ తెలిపారు.

కొత్తూర్: మున్సిపాలిటీలోని కుమ్మరిగూడ, తిమ్మాపూర్ గ్రామాల్లో కిరాణ దుకాణాల్లో అక్రమంగా నిల్వ ఉంచిన మద్యాన్ని ఎస్వోటీ పోలీసులు స్వాధీనం చేసుకుని తమకు అప్పగించారని ఇన్‌స్పెక్టర్ నర్సయ్య తెలిపారు. కుమ్మరిగూడలో శ్రీరాములు కిరాణ దుకాణంలో 9.69లీటర్లు, తిమ్మాపూర్‌లో రవిసింగ్ కిరాణం దుకాణంలో 7.72 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామని ఇన్‌స్పెక్టర్ పేర్కొన్నారు.

కడ్తాల బీఆర్ఎస్ సర్పంచ్ అభ్యర్థిగా బావండ్లపల్లి ఆనంద్



కడ్తాల్, నవంబరు29(ఆంధ్రజ్యోతి): కడ్తాల మేజర్ గ్రామ పంచాయితీ బీఆర్ఎస్ సర్పంచ్ అభ్యర్థిగా మాజీ వైస్ఎంపీపీ బావండ్లపల్లి ఆనంద్ పేరును ప్రకటించారు. బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు కడారి రామకృష్ణ అధ్యక్షతన కార్యకర్తల సమావేశం నిర్వహించి అందరి ఏకాభిప్రాయం మేరకు అభ్యర్థిగా ఆనంద్ పేరును ఖరారు చేశారు.

షిర్డీ సాయినాథుడిని దర్శించుకున్న రాము



ఆమనగల్లు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఆర్యవైశ్య సంఘం రాష్ట్ర నాయకుడు, సంఘ సేవకుడు పాపిశెట్టి రాము శ్వేత దంపతులు శనివారం షిర్డీ సాయి బాబా ఆలయాన్ని దర్శించుకున్నారు. బాబాకు పూజలు నిర్వహించారు. అర్చకులు రాముశ్వేత దంపతులను ఆశీర్వదించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో భూపతిరెడ్డి, తదిరులు ఉన్నారు.

గుర్తు తెలియని ఫోన్ మెసేజ్‌లను చదవొద్దు

యాచారం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): సైబర్‌నేరాలు పెరుగుతున్నాయని, గుర్తుతెలియని నంబర్ల నుంచి వచ్చే మెసేజ్‌లను ఓపెన్ చేయొద్దని యాచారం ఎస్సై ప్రియాంక బాలికలకు సూచించారు. శనివారం గున్గల్ మోడల్ పాఠశాల, కళాశాల బాలికలకు సైబర్ నేరాల పట్ల అవగాహన కల్పించారు. ఎలాంటి ఓటీపీని ఎవరికీ చెప్పొద్దని తెలిపారు. ఎవరైనా వేధిస్తే 100కు కాల్ చేయాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ లావణ్య, టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

'ఉనికి కోసమే దీక్షా దివస్'

మొయినాబాద్ రూరల్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): తెలంగాణ కోసం 2009లో కేసీఆర్ చేసిన దీక్ష బూటకం అని, ఆయనతో తెలంగాణ రాలేదని పీసీసీ అధికార ప్రతినిధి గౌరిసతీష్ అన్నారు. శనివారం మాట్లాడుతూ.. ఉనికి కోసమే బీఆర్ఎస్ దీక్షా దివస్ కార్యక్రమాన్ని నిర్వహిస్తుందని పేర్కొన్నారు. ప్రజల బలిదానాలకు చలించిపోయి సోనియాగాంధీ తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చారని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ఉనికి కాపాడుకునేందుకే దీక్షా దివస్ పేరిట డ్రామా ఆడుతోందని అన్నారు.

'ఉద్యమకారులను అణగదొక్కి.. దీక్షా దివస్‌లోనా?'

కందుకూరు,నవంబరు 29(ఆంధ్రజ్యోతి): ఉద్యమకారుల పట్ల కుట్రలు, కుతంత్రాలు చేసిన వారు నేడు దీక్షా దివస్‌లో పాల్గొనడం విడ్డూరంగా ఉందని తెలంగాణ జాగృతి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కప్పాటి పాండురంగారెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నాడు కేసీఆర్‌ను అంతమొందించాలని, టీఆర్ఎస్ పార్టీని లేకుండా చేయాలని కుట్రలు చేసిన వ్యక్తులు నేడు బీఆర్ఎస్‌లో పెద్దలుగా వ్యవహరించడం విడ్డూరంగా ఉందన్నారు.

మాడ్గుల మండలంలో మూడో విడతలో ఎన్నికలు

మాడ్గుల, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని 34 పంచాయితీలకు మూడో విడతలో డిసెంబరు 17న ఎన్నికలు నిరవహిస్తామని ఎంపీడీవో విజయలక్ష్మి తెలిపారు. డిసెంబరు 3 నుంచి 5 వరకు నుంచి నామినేషన్లు స్వీకరిస్తామన్నారు. ఆయా పంచాయతీలకు సమీప క్లస్టర్ల వారీగా నామినేన్లు స్వీకరిస్తామని చెప్పారు.

అరిస్టాటిల్ కళాశాలలో ఘనంగా ఫ్రెషర్స్ డే



మొయినాబాద్ రూరల్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): చిలుకూరు పరిధి అరిస్టాటిల్ పీజీ కళాశాలలో శనివారం ఫ్రెషర్స్ డే నిర్వహించారు. నూతనంగా కళాశాలలో చేరిన వారికి స్వాగతం పలుకుతూ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులు ఎంతో ఉత్సాహంతో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ముఖ్యఅతిథి సైబర్ క్రైం డీసీపీ గిరిరాజు పాల్గొని మాట్లాడారు. దేశంలో సైబర్ నేరాలు పెరిగిపోతున్నాయని, విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ లోకసాని శ్రీనివాస్ రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా దీక్షా దివస్

మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ తెలంగాణ కోసం ఆమరణ నిరాహార దీక్ష చేసిన నవంబరు 29న ఏటా దీక్షా దివస్ నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో శనివారం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పలు చోట్ల దీక్ష దివస్ కార్యక్రమాలను నిర్వహించారు. బీఆర్ఎస్ నాయకులు పార్టీ జెండాను ఆవిష్కరించారు.

- ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్, నవంబరు 29



శంకర్‌పల్లి చౌరస్తాలో బీఆర్ఎస్ జెండా ఆవిష్కరించిన పార్టీ మండల అధ్యక్షుడు గోవర్ధన్‌రెడ్డి



కడ్తాలలో కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న దశరథ్‌నాయక్, రామకృష్ణ, ఆనంద్, నాయకులు

గెలుపు గుర్రాల అన్వేషణ

(5వ పేజీ తరువాయి)



బలం ఉన్న అభ్యర్థులను బరిలో నిలిపేందుకు అన్వేషణ సాగిస్తున్నారు. కొన్ని చోట్ల సర్పంచ్ పదవికి తీవ్ర పోటీ ఉంది. మహిళా రిజర్వు స్థానాలతో పాటు ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వు స్థానాల్లో అభ్యర్థుల ఎంపికకు పార్టీ నేతలతో పాటు అగ్రనేతలు సమాలోచనలు చేస్తున్నారు. సర్పంచ్ పదవిపై ఆశలు పెంచుకున్న యువకులు, నేతలు ఎలాగైనా గెలవాలనే ఉద్దేశంతో పార్టీలను పక్కన ప్రజల మద్దతు కూడగట్టే ప్రయత్నం చేస్తున్నారు. వ్యక్తిగత ప్రతిష్ఠకు ప్రాధాన్యం ఉండడంతో ఒకే పార్టీ నుంచి ఇద్దరు ముగ్గురు పంచాయతీ బరిలో దిగేందుకు సిద్ధ పడుతున్నారు. రహస్య ప్రచారాలతో ముందుకు సాగుతున్నారు. గ్రామాల్లో పట్టున్న వ్యక్తులను తమ వైపు తిప్పుకొని అభ్యర్థిత్వాలు ఖరారు చేసేందుకు కొన్ని పార్టీల నేతలు ప్రయత్నాలు సాగిస్తున్నారు.

రాజకీయ పక్షాలకు ప్రతిష్ఠాత్మకంగా..

ఆమనగల్లు, మాడ్గుల, తలకొండపల్లి, కడ్తాల మండలాల్లో పంచాయతీ సమరాన్ని అన్ని రాజకీయపక్షాలు ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటున్నాయి. మెజార్టీ పంచాయతీల్లో పాగాకు ఎత్తులు వేస్తున్నాయి. ప్రచార అస్త్రాలకు పదును పెడుతున్నాయి. పార్టీల గుర్తులు లేకుండా నిర్వహించనున్న ఈ ఎన్నికలను అన్ని పక్షాలు చాలెంజ్‌గా తీసుకుంటున్నాయి. ఆమనగల్లు మండలంలో 13, మాడ్గుల మండలంలో 34, తలకొండపల్లి మండలంలో 32, కడ్తాల మండలంలో 24 పంచాయతీలు ఉన్నాయి.

వేలం పాటలు షురూ..


కొన్ని పంచాయతీల్లో సర్పంచ్ పదవికి వేలం కూడా జరుగుతున్నట్లు సమాచారం. నామినేషన్ల పర్వం ఆరంభానికి ముందే ఏకగ్రీవం పేరిట వేలం తంతు అంతర్గతంగా జరుపుతున్నట్లు తెలుస్తోంది. హైదరాబాద్‌కు చేరువలో ఉన్న ఆమనగల్లు, కడ్తాల, తలకొండపల్లి, మాడ్గుల మండలాల పరిధిలో సర్పంచ్ పదవికి డిమాండ్ పెరిగింది.

ఇబ్రహీంపట్నం మండలంలో...

ఆదిభట్ల: జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉప ఎన్నిక గెలుపుతో పట్నంలో కాంగ్రెస్ శ్రేణుల్లో జోష్ నిండింది. స్థానిక ఎన్నికల్లో గెలుపు కోసం హస్తం పార్టీ నాయకత్వం సన్నాహాలు మొదలుపెట్టింది. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి పాలైన బీఆర్ఎస్ ఈ సారి ఎలాగైనా పంచాయతీ ఎలక్షన్స్‌లో తమ అభ్యర్థులను గెలుపించుకునేందుకు ప్రణాళికతో ముందుకు సాగుతుంది. అభ్యర్థులు ఎక్కువ ఉండటంతో కమిటీ పరిశీలకులుగా వచ్చిన నాయకులు ఒక్కో పంచాయతీ నుంచి ముగ్గురు నలుగురి పేర్లను మండల అధ్యక్షుల ద్వారా అధిష్ఠానానికి పంపారు. మరోపక్క తమకు పట్టున్న గ్రామాల్లో పోటీ చేయాలని బీజేపీ, సీపీఎం పావులు కదుపుతున్నాయి.

ఇబ్రహీంపట్నం మండలంలో 14 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఇందులో దండుమైలారం, మూకునూర్, నెర్రపల్లి, రాయపోల్, పోల్కంపల్లి, నాగన్‌పల్లి, ఉప్పరిగూడ, పోచారం, కర్ణంగూడ, చర్లపటేల్‌గూడ, తుర్కగూడ, కప్పాడు, ఎలిమినేడు గ్రామాలు ఉండగా, వీటిలో 144 వార్డులు ఉన్నాయి. మొత్తం 31,835 ఓటర్లు ఉండగా.. పురుషులు 15,780 మంది, స్త్రీలు 16053 మంది, ఇతరులు ఇద్దరు ఉన్నారు. 50 శాతం రిజర్వేషన్లు మించకుండా ప్రభుత్వం రిజర్వేషన్లు ప్రకటించింది. ఇందులో 7 జనరల్, 3 బీసీ, 4 ఎస్సీలకు రిజర్వు చేసింది. దీంతో గ్రామాల్లో సర్పంచ్, వార్డు స్థానాల్లో ఆశావహులు ఎక్కువ సంఖ్యలో సర్పంచ్ పదవి కోసం పోటీ పడుతున్నారు. గ్రామాల్లో ఆశావహులు ఎక్కువ కావడంతో ఇటు అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీలు అభ్యర్థుల ఎంపికలో ఆచితూచి వ్యవహరిస్తున్నాయి. కొందరు సర్పంచ్ అభ్యర్థులు ఓటర్లను మచ్చిక చేసుకునేందుకు ముందస్తుగా ప్రచారం మొదలుపెట్టారు. గ్రామాల్లో ఉన్న కుల పెద్దలు, యువజన సంఘాల నాయకులను, కులాల వారీగా సమీకరణలు ఎలా ఉన్నాయో లెక్కలు వేసుకుంటున్నారు.

'సీఎస్ఆర్'తో జలకళ



సీఎస్ఆర్ ఆధ్వర్యంలో నిర్మించిన సాయిరెడ్డి చెరువు కట్ట

(5వ పేజీ తరువాయి)

తలపిస్తున్నాయి. దీంతో కొత్తూర్ పట్టణ ప్రజలతోపాటు, అన్నదాతలు, మత్స్యకారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. షాద్‌నగర్ ఎమ్మెల్యే శంకర్ ఆధ్వర్యంలో చెరువుల్లో చేపపిల్లలను విడుదల చేశారు. సంవత్సరం క్రితం ప్రారంభమైన పునరుద్ధరణ పనులు చివరి దశకొచ్చాయి.

సుందరీకరణతో ఆహ్లాదం

కొత్తూర్ మున్సిపాలిటీలోని సాయిరెడ్డి చెరువు, గోదుమకుంట చెరువులను ఆధునీకరించేందుకు స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో కార్పొరేట్ సంస్థలు ముందుకు వచ్చాయి. దాదాపు 33ఎకరాల విస్తీర్ణంలో సాయిరెడ్డిచెరువు ఉండగా 180 బిలియన్ లీటర్ల నీటి సామర్థ్యం దీని సొంతం. అలాగే గోదుమకుంట 19 ఎకరాల విస్తీర్ణంలో ఉండగా దీని నీటి సామర్థ్యం 94బిలియన్ లీటర్లు. పునరుద్ధరణ పనులతో ఈ చెరువులు జలకళ సంతరించుకున్నాయి. సీఎస్ఆర్ కింద శాస్త్రీయ పద్ధతిలో చెరువుల్లో పూడికతీత పనులు చేపట్టారు. కట్టలను పటిష్ఠం చేశారు. అలాగే వెడల్పు చేసి గ్రీనరీ ఏర్పాటు చేశారు. జంగిల్ క్లియరెన్స్ చేసి కట్టల వద్ద ప్లాంటేషన్, అలుగులకు మరమ్మతులు చేపట్టారు. కట్టల వద్ద సోలార్ లైట్లు ఏర్పాటు చేసి, సుందరీకరణ పనులు చేపట్టారు.

రూ.4 కోట్లతో పనులు

సాయిరెడ్డి చెరువు, గోదుమకుంటను పునరుద్ధరణకు అమెజాన్ సంస్థ ముందుకొచ్చింది. రూ.4కోట్లతో ఎన్‌జీవో సంస్థ అయిన సెట్రీస్ ద్వారా పునరుద్ధరణ పనులు ప్రారంభించగా పనులు పూర్తికావచ్చాయి. సాయిరెడ్డి చెరువును మూడు మీటర్ల వెడల్పుతో ఆరు వందల మీటర్ల పొడవు కట్ట నిర్మించారు. మూడు మీటర్ల వెడల్పు, 500మీటర్ల పొడవుతో గోదుమకుంట కట్టను నిర్మించారు. స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.